# సంబంధం

సంజీవ్ (సంజీవరెడ్డి)తో ఇంటర్‌లో పరిచయం. తాండూర్‌లో అద్దెకొంపల కోసం వెతుక్కుంటూ కలిశాం. ఆ కలయిక పదిహేనేళ్లయినా సడలలేదు. సరికదా నానాటికీ దృఢమైంది. సంజీవ్ నాకంటే తెలివైనవాడే. అయినా అతని కులం ప్రభుత్వోద్యోగానికి అడ్డుగోడగా నిలిచింది. డిగ్రీ పూర్తిచేసి, ఏ అవకాశాల్లేక వాళ్ల బాబాయ్ వద్ద కాంట్రాక్టు పనుల్లో పద్దులు రాసుకునేందుకు చేరాడు.

నాలుగేళ్లలోనే మెలకువలన్నీ నేర్చి ఆయన మెప్పు సంపాదించాడు. ఆ తర్వాత ఆయన ఆశీస్సులతోనే స్వతంత్రంగా సివిల్ కాంట్రాక్ట్స్ చేయడం ప్రారంభించాడు. రెండు చేతులా సంపాదించడమూ అలవాటు చేసుకున్నాడు. నేను బి.ఇడి పూర్తిచేసి పంతులుద్యోగంలో సెటిలయ్యాను.

సంజీవ్‌కి ప్రభుత్వోద్యోగం రానందుకు ఒకప్పుడు బాధపడ్డ నేను, ఇప్పుడు వాడి సంపాదన చూసి అసూయపడుతుంటాను అప్పుడప్పుడూ. అందుకేనేమో ఎంతోఉన్నతంగా ఊహించుకున్న ఉపాధ్యాయవృత్తి అతని సంపాదనతో పోల్చుకున్నప్పుడు తేలికగా అనిపిస్తూంటుంది.

వాడి భార్య ప్రసూన ఈకాలానికి ఎంతో ఉత్తమ ఇల్లాలు.

వాళ్లది అరేంజ్డ్ మ్యారేజ్ అయినా తొలిచూపులోనే ఆమె అందానికి ముగ్ధుడై నామమాత్రపు కట్నంతో ఎంతో ఇష్టపడి చేసుకున్నాడు. ప్రసూన రంగులో, రూపంలో సంజీవ్‌కి కాస్త పై చేయే. కానీ గుణంలో ప్రేమలో ఆమె కంటే వాడెంతో ఉన్నతుడు.



అందుకే వాడామెకు సర్వస్వమూ అయ్యాడు. వాడి మాట పొల్లు పోకుండా పాటిస్తుంది. వాడి అభిమానాల్నీ, అభిరుచుల్నీ తనవిగా మార్చుకుంది.

వాడి బంధుమిత్రుల్ని వాడికంటే ఎక్కువగా ఆదరిస్తుంది. అందుకు తాజా ఉదాహరణ నేనే.

అఫ్‌కోర్స్ నేను మిగతా అందరికంటే కొంచెం ఎక్కువే కావచ్చు. ఎందుకంటే పెళ్ళి చూపుల నాటి నుంచి పరిచయం. ప్రసూనలాంటి అమ్మాయి దొరికేదాకా పెళ్లి చేసుకోవద్దని, ఉద్యోగంలో చేరినా దాటవేస్తూ వచ్చాను. ఇప్పటికే ఆలస్యమైంది. నా మనసెరిగిన ప్రసూనకే ఆ బాధ్యత అప్పజెప్పాను.

ఇప్పుడిక్కడికొచ్చిన పనిలోపని కూడా అదే. ఈ వేసవిలోనే అదేదో అయిపోతే బాగుండునన్న తొందర కూడా ఉంది.

సంజీవ్ పిలుపునందుకునే వచ్చాను. ఉండబట్టలేక ఫోన్‌లోనే అడిగితే "సెలవులే కదా. ఓసారి వచ్చేసేయ్" అంటూ సస్పెన్స్ మెయిన్‌టెయిన్ చేశాడు వాడు.

నేనూ తొందర పడదలుచుకోలేదు. ఉదయమే కదా వచ్చింది.

మధ్యాహ్నామో, సాయంత్రమో అదే తెలిసిపోతుంది.

మే నెల. ఉదయం తొమ్మిది కానే కాలేదు. ఎండ చిటపటలాడేస్తూంది ఇష్టంలేని మొగుడ్ని చూసినట్లు.

✠ ✠ ✠

" దశరథా! ఎక్కడున్నార్రా పనోళ్ళు? " సైట్ దగ్గర బైక్ దిగుతూనే అడిగాడు సంజీవ్, మేస్త్రీ దశరథ్ని.

"వస్తూన్నారు సార్! టైం అయినాది?" దశరథ సూర్యుని వైపు చూడబోయి చటుక్కున తల తిప్పుకున్నాడు. తలకి తువ్వాలు చుట్టుకుంటూ హడావిడిగా లేచాడు.

"ఇంగ ఎప్పుడొస్తరురా? ఇంత ఎత్మినాన్ అయితే పనులెట్టైతయిరా? మల్ల కొంచెం సేపు గాంగానే ఎండ... ఎండ... అంటానికి ఎప్పుడు అన్నానికి దిగుతమా అని ఎదురు జూస్తుంటారు. తిన్నంకనన్నా జల్ది పనికెక్కుతరా? నీకేం ఫరకు వద్దది బిడ్డా పైసల్ వదులయ్యేది నాకే గదా...." మధ్య మధ్యలో మాంచి బూతులు జోడిస్తూ క్లాసు పీకాడు సంజీవ్ దశరథకి.

అయిది వేయి గజాల అపార్ట్‌మెంట్. ఒక అంతస్థు స్లాబ్ పూర్తయింది. రెండో అంతస్థు కోసం సెంట్రింగ్ పని జరుగుతోంది. సంజీవరెడ్డి మాటలు వింటూనే కూలీలు కొరడా దెబ్బకు జూలు విదిలించిన గుర్రాల్లా మారిపోయారు. సిమెంట్ ధరల పెంపుతో పనులే అంతంత మాత్రంగా సాగుతున్నాయి.

ఆ పనినైనా నిలబెట్టుకోకపోతే బతుకు కష్టం ఆ బడుగుజీవులకు....

అందుకే మేస్త్రీతో సహా ఒక్క మాటైనా ఎదురాడకుండా పనుల్లో లీనమయ్యారు.

నలుగురు మగవాళ్ళు ఓ పక్క ఇనుపరాడ్లని వంచడం, కట్ చేయడం లాంటి పనులు చేస్తున్నారు.

కొంతమంది పిల్లర్‌టిన్స్‌ని అమరుస్తున్నారు. ఇద్దరు ఆడవాళ్ళు క్యూరింగ్ పనిలో ఉన్నారు. మరికొందరు ఆడవాళ్ళు కర్రలూ, చెక్కలూ మోస్తున్నారు. నా దృష్టి ఒక చోట ఆగిపోయింది.

అతని వయస్సు అరవై, డెబ్బై మధ్యన ఉండొచ్చు. మనిషి తెలుపే. అతని దుస్తులు కూడా వాళ్లకంటే తెల్లగా ఉన్నాయి. గడ్డం పూర్తిగా వెండిపూతే. నాలుగురోజులు కింద గీసుకుని ఉండొచ్చు. నుదుట విభూతి రేఖలు, మధ్యలో కుంకుమబొట్టు. తలకు ఎర్రని గీతల తువ్వాలు చుట్టుకుని ఉన్నాడు.

అతను పనిచేస్తున్నట్టు లేదు. ఏదో తపస్సు చేస్తున్నట్టు ఉంది.

స్లాబ్ మధ్యకి అవసరమయ్యే సన్నని రాడ్స్‌ని ఒక చిన్న ఫ్రేంలో పెట్టి వంచుతూ చతురస్రాకారం లోకి మారుస్తున్నాడు.

అరగంటసేపు అతడ్నే పరిశీలించాను. అతనికి పని తప్ప మరో ధ్యాస ఉన్నట్టు లేదు. మిగతావాళ్ళ పనికీ అతని పనికీ తేడా స్పష్టంగా కనిపిస్తుంది.

అందరినీ సంజీవ్ పేరు పేరునా మందలిస్తూ పనిలో చురుగ్గా పాల్గొనేట్టు చేశాడు. ఆపలకరింపు కూడా వెరైటీగా ఉంది. కొందర్ని కోప్పడ్డాడు.

కొందరిపట్ల సానుభూతి చూపించాడు. ఇంకొందర్ని ఫార్మల్‌గా , మరికొందరిని అంటీ ముట్టనట్లు వాడి పనితీరు ముచ్చట గొలిపేది. తరగతిలో విద్యార్థుల మూర్తిమత్వం తెలిసిన ఉపాధ్యాయుడిలా ఉంది వాడి వ్యవహారం. చివరిగా ఆ ముసలాయన వద్దకు చేరుకున్నాం.

"ఏం తాతా? బాగున్నావా?" ఈ పలకరింపులో ఆర్ద్రత.

అతను తిరిగి చూడలేదు. "బానే ఉన్నాసారూ!" అన్నాడు.

"నిన్న పొద్దుకు జామున గాయమైందంట?" సానుభూతిగా అన్నాడు సంజీవ.

"ఆఁ... చిన్న దెబ్బ. డాట్టారుకు జూపిచ్చిన. సూదిచ్చిండు. మందులేసుకున్నా. ఇప్పుడు బానే ఉన్నా. ఏం పర్వాలేదు" తన పని చేసుకుంటూనే జవాబు చెప్పాడు.

సంజీవ కూడా ఆ సంభాషణ అంతటితో ఆపేసి నీడలో కుర్చీలు వేసిన చోటికి వచ్చాడు. మౌనంగా అనుసరించాన్నేను. ఆ తాత ప్రవర్తనలో రెండు అంశాలు గమనించాన్నేను.

ఒకటి తన యజమాని కన్నా పనే గొప్పదన్న భావం, రెండవది ఇతరుల సానుభూతి పట్ల నిరాసక్తత.

ఒకరకంగా నిర్లక్ష్యంగా ప్రవర్తించాడనిపించింది నాకు. అదే అన్నాను సంజీవతో.

"నోనో! యు ఆర్ రాంగ్ శివా! అతను పక్కా మనిషి. పనిలో ఉన్నప్పుడు ఎవ్వరితోనూ మాట్లాడడు. నేను కాబట్టి ఆ మాత్రమైనా రెస్పాన్స్ ఇచ్చాడు. ఇతరులు అతడ్ని పలుకరించడానికే భయపడ్తారు. పని కూడా దశరథ అతడికి ప్రత్యేకంగా కేటాయి..

" ఏం పేరు?" నాలో ఆశ్చర్యం, కుతూహలం.

"శంకరయ్య...." మొదట్లో అతని వేషం, వాలకం చూసి 'వీడసలు పనిచేసే బాపతేనా? ఎందుకు తీసుకొచ్చావ్?' అంటూ దశరథను కోపగించుకున్నాను.

దశరథ కూడా అతని గురించి ఎక్కువ చెప్పకుండా "రెండ్రోజులు జూడుర్రి. తర్వాత అతని పని గురించి ఏమన్నా షికాయత్ ఉంటే నేనే పని వదులుకుంటా" అంటూ ఛాలెంజ్ చేశాడు.

దశరథ మాటే నిజమయ్యింది. పనిలో నిజాయితీ గల మనిషిని మొదటిసారి చూశాను.

"అతనితో మాట్లాడనా....." ఏదో క్యూరియాసిటీ నాలో.

"ఇప్పుడు కాదు లంచ్ బ్రేక్‌లో. ఇప్పుడు నువ్వు పలకరించినా పట్టించుకోడు" నవ్వాడు సంజీవరెడ్డి.

అదీ నిజమే అనిపించింది. అంతదాకా నిరీక్షించాను.

కూలీలంతా లంచ్ చేశారు. శంకరయ్య వాళ్లతో సరదాగానే కనిపించాడప్పుడు. ఆ తర్వాత అందరూ అక్కడక్కడా నడుంవాల్చారు. కింద ఇసుక, పైన క్యూరింగ్ చేస్తున్న బిల్డింగ్, ఏసీ బలా దూరనిపిస్తుంది.

శంకరయ్య ఇసుకలో ఓ మూలన సుఖపద్మాసనంలో కూర్చున్నాడు.

సంజీవ నన్ను పరిచయం చేశాడు.

"నీతో ఈసారు ఏదో మాట్లాడతాడంట!"

"ఏ ఊరు?" అడిగాను. పేరు అంతకు ముందే తెలుసుగాబట్టి.

"పాలమూరు" కూలీల ఊరు అన్నట్టనిపించింది.

"పిల్లల్లేరా తాతా?"

శంకరయ్య వెంటనే జవాబు చెప్పలేదు.

తర్వాత నెమ్మదిగా గొంతు విప్పాడు. "ఉన్నారు. ఇద్దరు కొడుకులు. ఒక బిడ్డ" అతని మొహంలో అయిష్టం.

"కొడుకులేం చేస్తున్నారు?"

"పెద్దోడు ఇంటివద్దనే యెవుసంజేస్తడు. చిన్నోడు హైదరాబాద్‌ల గవుర్మెంటు నౌకిరీల ఉన్నడు" పొడిగా చెప్పాడు.

"నీతో పాటు ఇక్కడెవ్వరుంటారు?"

"ఒక్కడ్నే. రెండేళ్లనాడు నా భార్య కాలం జేసింది.... " ఇబ్బందిగా చెప్పాడు.

"మరి కొడుకులుండగా మనవండ్లు, మనవరాండ్లతో హాయిగా కాలేక్షేపం జేయక ఇట్లా కష్టపడడమెందుకు?"

సూటిగా అడిగాన్నేను.

శంకరయ్య నుండి సమాధానం లేదు. బహుశా ఈ ప్రశ్న అతడ్ని ఇప్పటికెంతో మంది అడిగి ఉంటారు.

అసలు అడగకుంటే బాగుండేదేమో అనిపించింది.

అయినా చెప్పడానికేముంటుంది? ఏ తండ్రి కథ చూసినా ఒక్కటే వెత.

బిడ్డల నిరాదరణ, నిస్సహాయత, వార్ధక్యం, దుఃఖమయం.

కొద్ది క్షణాల తర్వాత అన్నాడు శంకరయ్య "ఎవరి బతుకలు వాళ్లవి సారూ! అయినా నేనేం కష్టపడుతున్నా? నా కష్టం నేనే జేసుకుని బతుకొద్దా?"

అది నేనూహించలేదు.

కానీ ఊరుకుంటానా?

"ఈ కష్టమేదో నీ వాళ్ళ మధ్యన ఉండి చేసుకుంటే వాళ్లకూ, నీకూ సంతోషంగా ఉంటుంది కదా!" అతని మొహంలోకి చూశాను.

"ఈ ముసలోళ్లంతా ఇంతే!"

తోటి ఆడకూలీ మా సంభాషణ ఆసక్తిగా వింటూ కల్పించుకుంది.

"పిల్లల దెగ్గెరుండి ఏదో మల్లాడు మంటే ఎనకా ముందైతరు. ఇంకొగల్ల దెగ్గె రైత ఎట్టి శాకిరీ జేస్తరు. మరి పట్నంల కొడుకూ, కోడలు దెగ్గెర కమ్మగ దినుకుంట ఉండరాదా? గీ మురికి కష్టం జెయ్యిమంటాని ఎవ్వడు గొట్టిండు?"

శంకరయ్య ఆమెను కసురుకుంటాడనుకున్నా. కానీ వినీ విననట్లు ఊరుకున్నాడు.

"అవునూ, ఊళ్ళో నీ పెద్దకొడుకు వద్దా, సిటీలో చిన్నబ్బాయి దగ్గరో ఉండొచ్చు కదా!" ఇందాక ఆడిగిన ఆవిడ మాటల్నే మరోరకంగా అడిగాన్నేను.

'చెప్పాలా ? వద్దా?'

అన్నట్టు కొద్దిసేపు తటపాయించాడు శంకరయ్య. తర్వాత తప్పదనయనట్టు గళం విప్పాడు.

"పెద్దకోడలు గయ్యాళి. నా భార్యకూ ఆమెకూ ఒక్క నిముషం పడేది గాదు. చేనికాడ ఏదో తగాదా. అది నా భార్య నెత్తిమీద బిందెతో గొట్టి సంపింది. కడుపు జించుకుంటే కాళ్లమీద వడుతది. ఎవరికీ జెప్పుకోలే. ఆడ నాకు ఉండ బుద్ధి గాలేదు."

"చిన్న కొడుకు దగ్గర...." సంశయిస్తూ అడిగాను.

"చిన్న కోడలు సదూకున్నది. పెండ్లై ఆరేండ్లయింది. ఇంతవరకూ ఆయమ్మకు మా ఊరే దెలువది....."

ఏ భావమూ లేకుండా చెప్పసాగాడు శంకరయ్య.

" ఆ పిల్లలకు నాయనమ్మ దెలువది, తాత దెలువడు. ఎన్నడన్న ఆల్ల ఇంటికివోతె మమ్ములను గూడా అమ్మమ్మ, తాతయ్య అంటాని పిలుస్తరు. కోడలమ్మకు మేమా ఇంట్ల ఉన్నంతసేపు శిటపట శిటపటనే. కొడుకు ఆమెను పేమించి పెండ్లి చేసుకున్నడు ఆమె

ఎంత జెపితె వాడంతే. వాడు మంచోడే (!?) ఆమె పడనియ్యది. ఆడికిపోతే సిచ్చు వెట్టినట్లే గదా.... " ఆ మాటల మాటున అస్పష్టమైన దిగులు.

"..... మీద దన్నాలె గసువంటి కొడుకుల్ని. ముక్కు దీసి, ముడ్డి కడిగి, కన్నమ్మ కష్టం జేసి పెంచి పెద్దజేస్తే సంపాదనపరులై కన్నపేగును కష్టపెడ్తారు? సూటు బూటులేసుకోంగనే మిన్ను మన్ను గనవడదేమో. లం....కొడుకు లకు థూ !"

అంతకుముందు విమర్శించిన ఆవిడ ఆవేదన వెళ్లగక్కింది.

" నీచిన్న కొడుకు పేరేంది? ఏం పనిచేస్తుంటడో చెప్పు. నేనెళ్ళి మాట్లాడతా" ఓ నిర్ణయానికి వచ్చాన్నేను.

"వొద్దుసారూ!" చేతులు జోడించాడు శంకరయ్య.

"నాకేం కష్టంలేదు. బతికున్నన్ని రోజులు ఇట్లా కష్టపడగలిగే శక్తిగా బగవంతుడు నాకిస్తే జాలు. అందరూ సల్లంగ ఉండాలె. గంతే...." అతని కళ్లల్లో నీటిపొర.

ఆ కొడుకులు దురదృష్టవంతులో ఈ తండ్రి అదృష్టహీనుడో తేల్చుకోలేక పోయాను.

భారంగా కదిలాను అక్కడినించి.

సైట్ వద్ద నుండి ఇంటికి వచ్చేందుకు సిద్ధమయ్యాం.

"ఈ ముసలోడు ఒక్కడే గదా! కష్టం జే ిన పైసలన్నీ ఏం జేస్తడురా?" దశరథను అడిగాడు సంజీవరెడ్డి.

"ఒక్క పైస గూడా పాడుజెయ్యడు సారూ వారం వా ం పోస్టాఫీసుల కొన్ని పైసలు జమజేస్తడు.

"ఆదివారం, ఆదివారం దుర్గమ్మ గుడికాడికి పొయ్యి శాతగాని ముసలోళ్లకు పాలు, పండ్లు, బ్రెడ్డూ ఇప్పిస్తడు. కొందరికి ఐదో, పదో శేతుల వెడ్తడు. అల్లు ఇతడ్ని దేవుడ్ని జూసినట్లే జూస్తరు...."

దశరథ మాటలతో నా మనసు చెమ్మగి ంది.

అతనికేదైనా కష్టం కలిగితే తప్పకుండా ఆదుకోవాలని నిర్ణయించుకున్నాను.

ఇల్లుచేరిం తర్వాత మూడాఫ్‌లో ఉండడం గమనించిన ప్రసూన కారణమడిగింది.

"ఏంటో ప్రసూనా! నా కోసం ఇకపై నువ్వు ఏ అమ్మాయినీ చూడనవసరం లేదు"

నా మాటతో ఆశ్చర్యపోయిందామె.

"ఆ అమ్మాయి నీకంటే, నాకంటే ముందు అమ్మానాన్నకు నచ్చాలి. వాళ్లను ఆదరించగలిగే సహనం, సహృదయత ఆమెకుండాలి. ఆమె చదువుకున్నదైనా, కాకున్నా నాకభ్యంతరం లేదు. నీలా అందంగా ఉండాలన్న నియమం కూడా లేదు....."

సంజీవ్, ప్రసూన అపనమ్మకంగా చూశారు నన్ను.

❀❀❀

(ఆంధ్రభూమి సచిత్రవార పత్రిక ఆగస్టు, 2006)